క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యదేవాలయం మూసివేత ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా సూర్యదేవాలయం మధ్యాహ్నం 12.30 గంటలకు మూసి వేశారు. ఆలయం మరల సోమవారం ఉదయం 9 గంటలకు తెరవనున్నారు.అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం భాగ్యం కలుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

దోమల మందు పిచికారీ



మర్రిపూడిలో దోమల మందు పిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రంగంపేట: మర్రిపూడి గ్రామంలో సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దష్ట్యా దోమలు వ్యాప్తి చెందకుండా గ్రామంలో డ్రైనేజీల్లోనూ, మురుగు కాలువల వద్ద, గుబురు ప్రాంతాల్లోనూ పారిశుధ్య సిబ్బంది దోమల మందు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్స్ బారిన గ్రామస్తులు పడకుండా ఉండడానికి చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ వేము చిరంజీవి, పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



మూసివేసిన రామలింగేశ్వరస్వామి ఆలయం

అనపర్తి : సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం అనపర్తి మండలంలోని ఆలయాలను మూసివేశారు. ఉమారామలింగేశ్వర స్వామి వారి ఆలయం, జనార్దన స్వామివారి ఆలయం, పొలమూరు మదనగోపాలస్వామి వారి ఆలయం, దుప్పలపూడిలోని చంద్రశేఖర స్వామి వారి ఆలయం తదితర ఆలయాలను మూసివేశారు. ఆదివారం తెల్లవారు జామున విశేష పూజలు నిర్వహించారు. తిరిగి సోమవారం ఆలయం తెరిచి సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం భక్తులకు స్వామి దర్శనమిస్తారని ఆలయాల అర్చకులు తెలిపారు.

సామూషిక నిర్మూలన

- ఖరీఫ్ వరిసాగుకు ఎలుకల బెడద
- పంట దిగుబడి తగ్గే అవకాశం
- నానా పాట్లు పడుతున్న రైతులు
- ఒకేసారి నిర్మూలనను చేపట్టాలని చెబుతున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: ఖరీఫ్‌లో వరిసాగు ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. ఎలుక్కొట్టుడు వల్ల పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఎక్కువుంది. అందువల్ల రైతులు పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. రైతులు కష్టపడి వేసుకున్న పంటలను అటు ప్రకృతి వైపరీత్యాల నుంచి, ఇటు చీడపీడలు, ఎలుకల బారి నుంచి కాపాడుకునేందుకు రకరకాల పద్ధతులను పాటిస్తున్నారు. ప్రస్తుతం ఎలుకలు బెడద కూడా అధికంగానే ఉంది. వాటి నిర్మూలనకు రైతులందరూ ఒకేసారి సామూహికంగా చర్యలు చేపట్టాలని లేదంటే ఫలితం ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నిరంతరం శ్రమిస్తూ..

విత్తనాల నుంచి పంట కోతకు వచ్చే వరకు ఆశించిన దిగుబడులను పొందే విధంగా, పంట భూములకు అవసరమైన బలాన్ని అందించేలా ఖర్చుకు వెనుకాడ కుండా ఎరువులను, పురుగు మందులను కర్షకులు వాడుతుంటారు. అయితే చీడపీడల నుంచి ఏవిధంగా పంటలను కాపాడుకుంటూ వచ్చినా గాని, ఎలకల బెడద మాత్రం వీడడం లేదు, దీంతో మంచి దిగుబడులు వస్తాయనుకునే పంటల నుంచి ఒక్కోసారి ఆశించిన ఫలితాలను అందుకోలేకపోతుంటారు. ఫలితంగా పెట్టిన పెట్టుబడులు రాక, అన్నదాతలు ఆర్థికంగా నలిగిపోయే పరిస్థితులు ఎదురవుతుంటాయి.



ఎలుకల నిర్మూలనకు ఎర తయారీపై రైతులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయాధికారులు ముందుగానే రైతులను చైతన్యపరుస్తూ, ఎలుకల నిర్మూళన పై రైతులను అప్రమత్తం చేస్తున్నారు. విడివిడాగా కాకుండా అంతా కలిసి సామూహికంగా ఎలుకలను నివారించే చర్యలు చేపట్టాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు అందుకుంటారని సూచిస్తున్నారు.

నివారణా చర్యలు

సాధారణంగా ఎలుకలు పొలాలలో గట్ల వెంబడి బొరియలు చేసుకుని, వాటిలో జీవనం సాగిస్తుంటాయి. కనుక ఆ బొరియలను గుర్తించి, వాటిలో పొగ పెడితే ఊపిరాడక అవి చనిపోవడం లేదా ఆ ప్రాంతం వదిలి దూరంగా పారిపోవడం చేస్తాయి. కొంతమంది అయితే ఇటువంటి బొరియల వద్ద ఎలుకలను పట్టుకునేందుకు బోన్లు పెట్టిస్తుంటారు. మరికొంత మంది పొలంలో బుట్టలు పెట్టి ఎలుకలను పట్టించే ప్రయత్నం చేస్తుంటారు. వీటన్నికంటే ఎలుకలను నిర్మూలించేందుకు క్రిమి సంహారక మందుతో తయారు చేసిన ఎరలే మంచి ఫలితాలనిస్తాయి. బ్రోమోడలైన్ 50 మిల్లిగ్రాముల రెండు కిలోల బియ్యంలో కలిపి ఎరను తయారు చేసి, గుర్తించిన బొరియల వద్ద ఉంచాలి. అయితే ఈ పని చేయడానికి రెండు రోజుల ముందు ఎలుకలకు నమ్మకాన్ని కలిగించే విధంగా రసాయన మందు కలపకుండా నూనె, బియ్యం కలిపి ఆ బొరియల వద్ద ఉంచాలి. వాటిని తిన్న ఎలుకలకు ఒక నమ్మకం కలుగుతుంది. ఆ తరువాత రసాయన మందు కలిపిన ఎరను పెడితే అదే నమ్మకంతో తిని, మరణిస్తాయి. ఇది కాకుండా పాస్పేట్, జింక్ సల్ఫేట్‌తో తయారు చేసిన బిస్కెట్‌లతో కూడా ఎలుకలు చనిపోతాయి. ఈ బిస్కెట్‌లను బొరియలలో వేస్తే, వాటి ద్వారా వ్యాపించే గాలిని పీల్చుకుని ఎలుకలు చనిపోతాయి. అయితే ఈ సమయంలో బిస్కెట్‌లను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. లేకుంటే కొత్త సమస్యలు ఎదురవుతాయి.

29,585 హెక్టార్లలో వరి సాగు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో ప్రస్తుతం 29,585 హెక్టార్లలో వరి పంట సాగును చేపట్టారు. ఈ సీజన్‌లో ముందుగా సాగు చేసిన ప్రాంతాలలో వరి పొలాలు చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో పంటను నిరంతరం పరిశీలిస్తూ, ఎలుకల బారిన పడకుండా కాపాడుకోవలసిన అవసరం ఎంతో ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటను నాశనం చేసి, దిగుబడులను దెబ్బతీయడంలో ఎలుకలు ముందుంటాయి.

సామూహికంగా నివారణా చర్యలు చేపట్టాలి

పొలాల్లో ఎలుకల నివారణను ఒక్కొక్కరుగా కాకుండా రైతులంతా సామూహికంగా చేపటితే మంచి ఫలితాలు ఉంటాయి. ఎవరికి వారే వేరువేరుగా చేపట్టడం వలన ఎలుకలు పక్క రైతు పొలంలోకి పారిపోయేందుకు అవకాశం ఉంటుంది. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటుగా ప్రయాణించి అవి తమ ప్రాణాలను కాపాడుకుంటాయి. అదే ఆయా ప్రాంతంలోని రైతులంతా ఒకేసారి ఎలుకల నిర్మూలనకు సామూహికంగా చర్యలు చేపడితే మంచి ఫలితాలను అందుకుంటాయి. ఈ మేరకు గ్రామాలకు వెళ్లి రైతులను చైతన్యపరుస్తున్నాం.

– ఎ.కల్యాణ్‌సూర్యకుమార్, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

యువతి అదృశ్యం

సీతానగరం: స్థానిక లంకూరుకు చెందిన యువతి(21) కనిపించడం లేదని ఆమె తల్లి నారే చిలకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నారే చిలకమ్మ తెల్లవారు జామున నాలుగు గంటలకు లేచిచూడగా బుజ్జి కనిపించకపోవడంతో బంధువుల, స్నేహితుల ఇళ్ల వద్ద వాకబు చేశారు. అనంతరం ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో తన కుమార్తె కనిపించడం లేదని, గోపాలపురంకు చెందిన యాళ్ల మణి కుమార్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

బిక్కవోలు: వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్సై వి.రవిచంద్ర ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉలపల్లి గ్రామంలో శనివారం వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో సాయంత్రం ఒక సామాజిక వర్గానికి చెందిన వినాయకుడి ఊరేగింపు వస్తుండగా మరో వర్గానికి చెందిన వినాయకుని వాహనం అడ్డంగా ఉండడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవలో ఒక వర్గానికి చెందిన వ్యక్తి తలకు గాయమైంది. దీంతో మరో వర్గానికి చెందిన ఏడుగురిపై ఫిర్యాదు చేయగా బిక్కవోలు పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా చాగంటి

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అనపర్తికి చెందిన చాగంటి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం తూర్పు గోదావరి జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం రాజమండ్రి ఎన్‌జీవో హోమ్‌లో జరిగాయి. రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు చాగంటి మల్లికార్జున భాను ఎన్నికలు నిర్వహించి, కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఎన్నికల్లో అనపర్తి యూనిట్ నుంచి జిల్లా ఉపాధ్యక్షులుగా చాగంటి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా కె.సాల్మన్ రాజులకు చోటు దక్కింది. జిల్లా అధ్యక్షుడిగా కేజీకే మూర్తి, కార్యదర్శి కేవీఎస్ రెడ్డి, కోశాధికారిగా పామర్తి గోపాలరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ అక్బర్, మండలం యూనిట్స్ నుంచి మరో పదిహేను మంది ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరికి అనపర్తి యూనిట్ అధ్యక్షులు పీవీఎస్ సూర్యనారాయణ, సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో చండీహోమం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా వెండి, బంగారు పుష్పాలతో చండీ హోమం, పూజా, అర్చన కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్య లోభక్తులు పాల్గొన్నారు.

జేసీబీ సీజ్

కొత్తపల్లి: అమరవల్లి రావాడ శ్రీనివాస్‌రెడ్డి పొలంలో ఎటువంటి అనుమతులు లేకుండా జేసీబీతో బొండు ఇసుకను తవ్వుతుండగా ఆదివారం అధికారులు పట్టుకున్నారు. గ్రామంలో అక్రమంగా బొండు ఇసుకను తరలిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో జేసీబీని గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.రాజు సీజ్ చేశారు.

రైతులపై కూటమి దగా

- ఎన్నికల ముందు వాగ్దానాలు, తర్వాత మోసాలు
- అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రైతులను కూటమి ప్రభుత్వం దగా చేసిందని, ఎన్నికల ముందు వాగ్దానాలు ఇచ్చి తర్వాత మోసం చేసిందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరుగాలం కష్టించే రైతులు ప్రధానంగా యూరియా అందక ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మీడియా ముందుకు వచ్చి రైతులపై, వైఎస్సార్ సీపీపై అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు రైతుల కోసం ఎన్నో వాగ్దానాలు చేస్తే 15 నెలల కాలంలో అరకొరగా అది వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టిన తరువాతే స్పందించిందన్నారు.

ఎరువుల కొరతపై అసత్యాలు

రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కొరత లేదని చెబుతూ స్వయంగా వ్యవసాయ అధికారులతో రివ్యూ సమావేశం పెట్టి కొరతలున్నాయనే విషయాన్ని ఒప్పుకున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రతి రైతుకు రూ.20 ఇస్తామని చంద్రబాబు ప్రకటించి ఓట్లు దండుకున్నారని కానీ అధికారంలోకి వచ్చాక మొదటి సంవత్సరం కాలయాపన చేసి రెండో సంవత్సరం కేవలం రూ.5వేలు మాత్రం విదిల్చారన్నారు. కేంద్రం ఇచ్చిన రూ.2వేలు కలిపి చెప్పుకుంటున్నారని మిగతా డబ్బులు రైతుల ఖాతాల్లో ఇంకా జమ కాలేదని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించకుండా ప్రభుత్వమే బీమా చెల్లించిందని, కానీ కూటమి ప్రభుత్వం ఆ భారం రైతులపైనే మోపిందని ఆరోపించారు. పంటలు నష్టపోతే వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి కానీ ఇప్పటి వరకు ఏ చర్యలు తీసుకోలేదని కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే రైతులకు భరోసా, ఆర్థిక సాయం, బీమా లభించిందని, కానీ కూటమి ప్రభుత్వంలో అన్నీ ఆగిపోయాయని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు.




విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

ఎంపవరింగ్ వాయిస్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు ప్రదానం



అవార్డు పొందిన మూర్తి



అవార్డు పొందిన పద్మజ

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న యాళ్ల పద్మజ, మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నల్లం అచ్యుత రామచంద్ర మూర్తి దంపతులు అంతర్జాతీయ ఎంపవరింగ్ వాయిస్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డును సొంత చేసుకున్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఆన్‌లైన్‌లో వారు ఈ అవార్డు సత్కారాన్ని అందుకున్నట్టు ఆదివారం తెలిపారు. అంతర్జాతీయ ఏ వాక్ త్రు ఎడ్యుకేషన్ సీఈవో డాక్టర్ గ్లోరియా, డేవిడ్ గ్రీక్షీల్డ్ యు ఎస్సే, డాక్టర్ రానియాలంపు గ్రీస్ వారి సేవా సంస్థ అంతర్జాతీయంగా వివిధ దేశాల ప్రతినిధులతో విద్యా సంబంధ విషయాలపై చర్చ గోష్టి నిర్వహించినట్టు తెలిపారు. కోవిడ్‌కి ముందు కోవిడ్ తర్వాత విద్యా వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, దాని వలన విద్యార్థుల్లో ఏర్పడిన ప్రవర్తనాతీరు, మార్పులు తదనుగుణంగా ఉపాధ్యాయులు చేపట్టాల్సిన నూతన అంశములపై చర్చించారు. ఈ చర్చ గోష్టిలో ఇండియా తరపున నుంచి పద్మజ, అచ్యుత రామచంద్ర మూర్తి పాల్గొన్నారు. రాబోవు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా విద్యా సదస్సులు నిర్వహించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వీరు మంచి సూచనలు, సలహాలు అందించాలని ఆ కమిటీ వారు సూచించినట్టు తెలిపారు. ఈ అవార్డును అందుకున్నందుకు రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, పెద్దలు వీరిని అభినందించారు.

రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు

జేసీ మేఘస్వరూప్

రాజానగరం: జిల్లాలో రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టరు వై.మేఘస్వరూప్ అన్నారు. నరేంద్రపురంలో ఆదివారం స్థానిక రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఇంత వరకు రైతులకు 21,500 మెట్రిక్ టన్నులు అందించామన్నారు. ఈ విషయమై ఎవరికైన ఇబ్బందులు ఎదురైతే 8977935611కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవ రావు, ఎన్ఎఫ్ఓ తాతారావు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: మండలానికి 210 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని మండల వ్యవసాయశాఖాధికారిని గౌరిదేవి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సీతానగరం మండలంలో 14 సొసైటీ (పీఏసీఎస్)ల ద్వారా యూరియా రైతులకు అందిస్తున్నామని తెలిపారు. అయితే కొన్ని సొసైటీల్లోయూరియా పెద్దగా అవసరం లేదని, మిగిలిని వాటిని దృష్టిలో ఉంచుకుని సొసైటీకి 20 మెట్రిక్ టన్నుల (450 బస్తాలు) చొప్పున అందించామన్నారు. సొసైటీలకు 190 మెట్రిక్ టన్నులు, సీతానగరంలోని గ్రోమోరు రిటైల్ సెంటర్‌కు 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. పంట నమోదు చేసిన రైతులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి ఒకటి నుంచి రెండు బస్తాలను అందిస్తామన్నారు.



నరేంద్రపురంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జేసీ మేఘస్వరూప్

వైఎస్సార్ సీపీ మండల సెక్రటరీగా వీర్రాజు



వీర్రాజును అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

రంగంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనపర్తి నియోజకవర్గం ముకుందవరం గ్రామానికి చెందిన బోయి వీర్రాజును పార్టీ మండల సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా వీర్రాజును స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించిన పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన అనపర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి, మండల నాయకులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

గంగమ్మ ఒడికి గణేశుడు..!



గ్రామోత్సవంలో గణనాథుడు



వినాయకుడిని కాలువలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

అనపర్తి : గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో ఆదివారం వినాయక నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. అనపర్తిలోని కుమ్మరివీధి వినాయకుడి శోభా యాత్ర ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, డప్పులు, కోయడాన్సులు తదితర కళా ప్రదర్శనలతో యువకులు, మహిళలు కోలాహలం మధ్య వినాయకుడి ఊరేగింపులు కన్నుల పండువగా సాగింది. అనంతరం నల్ల కాలువ బ్రహ్మణ రేవులో నిమజ్జనం చేశారు. అలాగే గాంధీనగర్ వినాయకుడు తదితర వినాయకులను కూడా నిమజ్జనం చేశారు.

బిక్కవోలు: తొస్సిపూడిలో ఆదివారం వినాయకుడి వద్ద ఉంచిన 18 కిలోల లడ్డూ వేలం నిర్వహించారు. ఈ లడ్డూను వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథరెడ్డి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు లడ్డూను అందించారు.

పెదపూడి: మండలంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఏపీత్రయం, రామేశ్వరం , పెదపూడి, జి.మామిడాడ, చింతపల్లి, దోమాడ, కరకుదురు గ్రామాల్లో యువకులు, వివిధ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు వాయిద్యాలు, మేళాతాలు, బాణసంచా మధ్య గణనాథుడి ఊరేగింపు నిర్వహించారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సమీప పెద్ద కాలువల్లో నిమజ్జనం చేశారు. ఆయా ఆలయాల వద్ద ఆలయ కమిటీ వారు భారీ అన్నసంతర్పణలు నిర్వహించారు.

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలోని వందేళ్ల చరిత్ర కలిగిన రెడ్ల రామాలయం వద్ద వినాయకుని నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండ్ మేళాలతో వినాయకుని గ్రామోత్సవాన్ని తెల్లవార్లు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

సీతానగరం: మండలంలో గణపతి నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. ఆదివారం చంద్రగ్రహణమైనందున సాయంత్రం వరకు మండలంలో మిగిలిన విగ్రహాలను నిమజ్జన చేశారు. సింగవరంలో గణపతి నవరాత్రులు పూజలందుకున్న బాల గణపతిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం వంగలపూడి రేవులో గోదావరి జలాల్లో నిమజ్జన చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అన్నదానాలు జరిగాయి.



సింగవరంలో బాల గణపతిని ఊరేగిస్తున్న దృశ్యం



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిళల తీన్మార్

సౌరశక్తిపై ఆసక్తి

- సోలార్‌కు పెరుగుతున్న డిమాండ్
- సబ్సిడీతో ప్రోత్సహిస్తున్న కేంద్రం
- మండల ప్రజా పరిషత్‌పై ఏర్పాటు

సామర్లకోట: విద్యుత్ వినియోగం ఎక్కువైంది. అన్ని గృహోపకరణాలు విద్యుత్‌తో పనిచేస్తుండడంతో సోలార్ పవర్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రతి ఒక్కరూ సోలార్ వ్యవస్థపై ఆసక్తి చూపుతున్నారు. బొగ్గు కొరత ఏర్పడంతో విద్యుదుత్పత్తి సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఎదురయ్యే పరిస్థితి ఉండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సోలార్ విద్యుత్ కారణంగా పర్యావరణ పరిరక్షణకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. దీనిలో భాగంగా సూర్యుని ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసకునేలా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన లబ్ధిదారులు సోలార్ పవర్‌కు కావలసిన పెట్టుబడి పెట్టుకొనే అవకాశం లేదని, దీని వల్ల 200 యూనిట్ల లోపు విద్యుత్తును ఉపయోగించుకునే వారికి ఉచితంగా సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. భవనాలు ఉన్న వారి శ్లాబ్ పైభాగంలోను, పాకలు, పెంకుటిళ్లు ఉన్న వారి ఖాళీ స్థలంలోను సోలార్ ఏర్పాట్లకు రంగం సిద్ధం చేశారు. సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం లేని వారి కోసం ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆ ప్రదేశంలో సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసి దాని ద్వారా విద్యుత్ అందజేయడానికి జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోలార్ పవర్ ఏర్పాటు చేసుకుని వారి అవసరాలకు మించి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఏపీ ఈపీడీసీఎల్ సంస్థ తీసుకొని యూనిట్‌కు కొంత మొత్తాన్ని చెల్లిస్తోంది.

త్రీ కేవీ వరకు సబ్సిడీపై..

ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారికి ఏపీఈడీసీఎల్ ద్వారా సోలార్ సబ్సిడీపై అందజేస్తున్నారు. ఈ మేరకు వన్ కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కేవీకి రూ.60 వేలు, త్రీ కేవీకి రూ.78 వేల వరకు సబ్సిడీపై సోలార్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 15 ఏళ్ల క్రితం అప్పటి ఎంపీడీఓగా ఉన్న అడపా వెంకటలక్ష్మి (ప్రస్తుత డ్వామా పీడీ) సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసి అప్పట్లో జిల్లాకు ఆదర్శంగా నిలిచారు. వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నెడ్ క్యాప్, గెయిల్ సంస్థలు సంయుక్తంగా సోలార్‌ను ఏర్పాటు చేయగా దీనిని నుంచి నెలకు 600 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆస్పత్రికి కేవలం 400 యూనిట్లు మాత్రమే అవసరం కాగా మిగిలిన 200 యూనిట్లు ట్రాన్స్‌కోకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందుతున్నారు.



వేట్లపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు